క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ నాగరాజు

కోవూరు : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ ఎ.నాగరాజు ఆదేశించారు. మండలంలోని జగనన్న కాలనీల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల పరిధిలో 20 జగనన్న లేఅవుట్‌లు ఉన్నాయని, వాటిలో 2,548 మందికి ఇళ్ల స్థలాలు మంజూరైందని తెలిపారు. అలాగే సొంతంగా స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే వారు 602 మంది ఉన్నారన్నారు. మొత్తం కలిపి మండలంలో 3,150 మంది గృహ నిర్మాణ పథకంలో లబ్ధిపొందుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయని, వీటిని వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బిల్లుల విషయంలో ఎక్కడా జాప్యం లేకుండా మంజూరవుతున్నట్లు తెలియజేశారు. అనంతరం కోవూరు సచివాలయం–3ను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ మాధవయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి



సొసైటీ అధికారులకు సన్మానం

కోవూరు : సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని నెల్లూరు సహకార సంస్థ అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. కోవూరు శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార సొసైటీ కార్యాలయ ఆవరణలో సహకార సంఘాల పాలనా నిర్వహణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన ప్రయోజనాలే లక్ష్యంగా పెట్టుకుని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పని చేయాల్సిన అవసరముందన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన సహకార వ్యవస్థ పునాదులు బలంగా ఉండాలన్నారు. రైతులకు సొసైటీలపై నమ్మకం పంచడమే కాకుండా పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండలన్నారు. కార్యక్రమంలో డీసీటీఓ తిరుపాలు, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, సొసైటీ సీఈఓ గోవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు గున్నం జనార్దన్, అంబటి ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన అఖండ వేదపారాయణ సప్తాహం



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యానమందిరంలో చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో అఖండ వేదపారాయణ సప్తాహం రెండో రోజు శనివారం కొనసాగింది. శృంగేరిపీఠం ఉత్తర మహాసంస్థానాధీశులు జగద్గురు విధుశేఖర భారతి స్వామివారి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బ్రహ్మశ్రీ గుళ్లపల్లి శివశర్మ అవధాని పర్యవేక్షణలో తిరుపతికి చెందిన ఇరగవరం వేద శాస్త్ర పరిషత్ ట్రస్టు పర్యవేక్షణలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు వేదపండిత ప్రముఖులు రెండో రోజు కొనసాగించారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా లక్ష్మీ కామాక్షి శిష్యబృందంచే శ్రీశంకరభగవత్పాద విరచిత సౌందర్యలహరి స్తోత్ర గానం చేశారు.

భవ్యహాసినికి నోబెల్ వరల్డ్ రికార్డు

నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన నల్లంగు భవ్యహాసిని భరతనాట్యంతో 14 కిలోమీటర్ల తిరువణ్ణామలై ప్రదక్షిణ చేసి నోబెల్ వరల్డ్ రికార్డు అందుకుంది. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలోని అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్‌లో భవ్యహాసినిని ప్రిన్సిపల్ మీరా ప్రసాద్, వైస్‌ప్రిన్సిపల్ సురేష్ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న భవ్యహాసిని గత ఆరేళ్లుగా భరతనాట్య సాధన చేస్తోందని తెలిపారు. గత పది నెలలుగా వివిధ ఆలయాల్లో, ప్రదేశాల్లో నాలుగు గంటల పాటు నిర్విరామ ప్రదర్శనలు చేసిందని చెప్పారు. అదే స్ఫూర్తితో గత నెల 23న తిరువణ్ణామలై ప్రదక్షిణను భరతనాట్యంతో 3.36గంటల్లో పూర్తిచేసి అవార్డును అందుకుందని తెలిపారు. ఇప్పటికే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డును సొంతం చేసుకున్న భవ్యహాసిని భవిష్యత్తులో మరిన్ని అవార్డులను సాధించాలని కాంక్షించారు. భవ్యహాసిని గురువులు కళాదీప్తి కామాక్షీసుబ్రహ్మణ్యంను ప్రశంసించారు.

పేదల కష్టాలకు సకాలంలో పరిష్కారం

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పేదల కష్టాలను గుర్తించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే సకాలంలో పరిష్కరించారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 12, 13వ వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. అని ఆరాతీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర చేసి ప్రతి వర్గంలోని ప్రజల కష్టాలను గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో మేనిఫెస్టో ద్వారా నవరత్నాల పేరిట కనీస అవసరాలను తీరుస్తామని చెప్పినట్లు గుర్తుచేశారు. అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చాని తెలిపారు. ఇచ్చిన వాగ్దానాల్లో దాదాపు 97 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ముఖ్యంగా ప్రజలు 2019వ సంవత్సరంలో జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో 151 ఎమ్మెల్యే స్థానాలు, 23 ఎంపీ స్థానాలను ఇచ్చారని, అదే నమ్మకంతో రానున్న ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో దాదాపు 80 సచివాలయాల పరిధిలో 94,781 ఇళ్లను సందర్శించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, వైస్ చైర్మన్ షాహుల్, కౌన్సిలర్లు కందుకూరు యానాదిరెడ్డి, పుట్టా లక్ష్మీకాంతమ్మ, పార్టీ నాయకులు పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళీ, మోర్ల భరత్, మేనకూరు సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్

- నాలుగు వార్డుల్లో గెలుపు



మడమనూరులో దేవసేనమ్మకు డిక్లరేషన్ ఫారమ్ అందజేస్తున్న అధికారులు



బండేపల్లిలో గెలుపొందిన రమణమ్మ

మనుబోలు : మండలంలోని మనుబోలు, చెర్లోపల్లి, మడమనూరు, బండేపల్లి గ్రామాల్లోని నాలుగు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు. చెర్లోపల్లిలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన వల్లూరు శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. కాగా మిగిలిన మూడు స్థానాల్లో శనివారం జరిగిన ఎన్నికల్లో మనుబోలు నాలుగో వార్డులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పరమళ ఆదిలక్ష్మి 26 ఓట్ల మెజారిటీతో చింతల శేషమ్మపై విజయం సాధించారు. అలాగే మడమనూరులో ఏడో వార్డుకు జరిగిన ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉప్పు దేవసేనమ్మ తురకా అంకమ్మపై 18 ఓట్లతో విజయం సాధించారు. బండేపల్లి మూడో వార్డులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఆవుల రమణమ్మ ఒక్క ఓటు తేడాతో మేకల నిర్మలమ్మపై విజయం సాధించారు. ఆయా వార్డులో గెలిచిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు డిక్లరేషన్ ఫారమ్‌ను అందజేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ సంగమేశ్వరరావు, ఎస్సై అజయ్‌కుమార్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫుల్ జోష్



సంబరాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

మండల పరిధిలో నాలుగు గ్రామాల్లోని నాలుగు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నేతల్లో ఫుల్ జోష్ నెలకొంది. దీంతో పార్టీ శ్రేణులు బాణసంచా పేలుస్తూ కేరింతలు కొడుతూ సందడి చేశారు. మరీ ముఖ్యంగా మనుబోలు మండల కేంద్రంలోని నాలుగో వార్డు ఎన్నికను వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. గతంలో ఈ వార్డును టీడీపీ కేవలం ఒక్క ఓటు తేడాతో ఓడిపోవడంతో ఈ సారి ఇరు పార్టీలు పోటాపోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహించాయి. బెంగళూరు, హైదరాబాద్‌లలో స్థిరపడిన ఆయా పార్టీల సానుభూతిపరులను మనుబోలుకు రప్పించి ఓటు వేసేలా చేశారు. దీంతో ఈ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి 26 ఓట్లతో విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోగా టీడీపీ వర్గీయుల్లో నిరాశ ఆవహించాయి. విజయం అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలు గ్రామంలో ర్యాలీగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. 2024 ఎన్నికల్లో సైతం విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో నిత్య అన్నదానానికి దాతలు సోమవారం విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముత్యాలపాళెం గ్రామానికి చెందిన పెనగళూరు రామలింగయ్య కుటుంబసభ్యులు నిత్య అన్నదానానికి రూ.1,00,116 నగదును అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యం

- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్




వెంకటాచలం : ప్రజలను చైతన్య పరచడమే లక్ష్యంగా యాత్ర చేస్తున్నట్లు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఐక్యతా విజయపథం యాత్రలో భాగంగా మండలంలోని కనుపూరు పంచాయతీ జ్యోతినగర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాత్కాలిక ప్రయోజనాలు కాకుండా దీర్ఘకాలికంగా సమాజంలో వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు మేలు జరగాలని, దీనిపై వారిని చైతన్య పరచడమే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలు అన్ని విషయాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐక్యతా విజయపథం యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

వృద్ధురాలికి ఇల్లు అప్పగింత

ఇందుకూరుపేట : కోర్టు ఆదేశాల మేరకు మండలంలోని పాములవారిపాళెంలో ఓ ఇంటిని మస్తాన్‌బీ అనే వృద్ధురాలికి అప్పగించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ మస్తాన్‌బీతో తన కోడలు వహిదా మధ్య ఇంటి విషయమై కొంత కాలం క్రితం వివాదం జరిగి కోర్టుకు వెళ్లారన్నారు. కోర్టు నుంచి వచ్చిన తీర్పు ఆధారంగా ఆ ఇంటిని తనకు అప్పజెప్పాలని కోరుతూ మస్తాన్‌బీ తమను ఆశ్రయించిందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు ఇంటిని మస్తాన్‌బీకి అప్పజెప్పినట్లు చెప్పారు.


శాంతి ర్యాలీని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న వివిధ సంఘాల పాస్టర్లు

బుచ్చిరెడ్డిపాళెం : ఈనెల 22వ తేదీన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో యునైటెడ్ క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్లు కోరారు. బుచ్చిరెడ్డిపాళెంలోని తెలుగు బాప్టిస్టు చర్చిలో శనివారం వారు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈనెల 22న బుచ్చిరెడ్డిపాళెం, దగదర్తి, సంగం మండలాలకు చెందిన క్రైస్తవులు పాల్గొంటారని తెలిపారు. 22న ఉదయం 9 నుంచి తెలుగు బాప్టిస్టు చర్చి నుంచి వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం మీదుగా రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు పత్రి దేవదానం, జాన్సన్, ప్రభుకుమార్, జాన్‌పాల్, రవి, ఏజ్రా, సురేంద్ర, మనోహర్, రవికుమార్ పాల్గొన్నారు.

తిరుమలకు మహా పాదయాత్ర



పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు శనివారం ఉదయం మహా పాదయాత్రగా బయలుదేరారు. ముందుగా దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గమధ్యలో నడవలేని భక్తుల కోసం బస్సు, వ్యాన్‌లను ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు సాగే పాదయాత్రలో టిఫిన్, భోజన సౌకర్యాలను సమకూర్చుతున్నట్లు దేవస్థానం కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి వెల్లడించారు. వీరేపల్లి శ్రీనివాసులురెడ్డి, శివాడ పరంధామిరెడ్డి, దాసరి సురేంద్రబాబు, సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, చొప్పా వెంకటేశ్వర్లు, ఎం.శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు వాహనాలకు వేలంపాట

పొదలకూరు : స్థానిక పోలీస్‌స్టేషన్లో సెబ్ అధికారులు పట్టుకున్న వాహనాలకు సోమవారం వేలం పాట నిర్వహిస్తారని ఎస్సై ఎస్‌కే కరిముల్లా శనివారం తెలిపారు. మహేంద్ర అల్ఫా ఆటో ప్రభుత్వ విలువ రూ.65,000 కాగా వేలంలో పాల్గొనేవారు రూ.6,500 చెల్లించాలని, హీరో హోండా ఫ్యాషన్ మోటారు సైకిల్ ప్రభుత్వ విలువ రూ.7,500 కాగా వేలంలో పాల్గొనే వారు రూ.750 చెల్లించాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలంపాటలో పాల్గొనాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రసన్న సారథ్యంలోనే అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న బుచ్చింగారి తిరుపతి

కోవూరు(విడవలూరు) : విడవలూరు మండలం రామచంద్రాపురంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సారథ్యంలోనే అభివృద్ధి జరిగిందని మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బుచ్చింగారి తిరుపతి అన్నారు. రామచంద్రాపురంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఏనాడు గ్రామాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. సునామి కాలంలో ఓ స్వచ్ఛంద సంస్థ మా గ్రామంలో ఇంటికి రూ.10 వేల చొప్పున ఇస్తే ఎవరికీ ఏమీ ఇవ్వకుండా కోటి పది లక్షలు రూపాయలను కాజేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో మా గ్రామంలో సచివాలయం, అంగన్‌వాడీ, సిమెంటు రోడ్లు, డ్రైయిన్ల ఇతర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అంతే కాకుండా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. అనంతరం సమావేశంలో సర్పంచ్ తరిపంగారి శీనయ్య, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం సభ్యుడు ఆవుల వాసు, పార్టీ నేతలు తాతారావు, రవి, నాగేంద్ర, జయరామయ్య ఉన్నారు.

ముగిసిన వార్డు సభ్యుల ఎన్నిక

కోవూరు : మండలంలోని పాటూరు గ్రామ పంచాయతీలో వార్డు సభ్యుడికి సంబంధించి శనివారం ఉపఎన్నిక జరిగింది. అనంతరం ఓట్ల లెక్కింపు జరిపి గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. పాటూరులో టీడీపీ బలపరిచిన అభ్యర్థి రామిశెట్టి రాజేశ్వరి గెలుపొందింది.

విడవలూరులో..

అన్నారెడ్డిపాళెం మూడో వార్డుకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి ఈదూరు ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వరిణి పంచాయతీకి సంబంధించిన వార్డులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి నట్టం సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సూర్యప్రభ వాహనంపై స్వామి విహారం

- గొలగమూడిలో భక్తుల కోలాహలం



సూర్యప్రభ వాహనంపై వెంకయ్యస్వామి

వెంకటాచలం : వెంకయ్యస్వామి 41వ ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం సూర్యప్రభ వాహనంపై స్వామివారు విహరించారు. ముందుగా వెంకయ్యస్వామి ఆశ్రమంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద గుమ్మడికాయ దిష్టి తీసి సూర్యప్రభ వాహనసేవను ప్రారంభించారు. పూలతో శోభాయమానంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామివారు ఆశీనులై భక్తులను ఆశీర్వదించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వామివారి ఊరేగింపు కనుల పండువగా సాగింది. ఈ గ్రామోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు గొలగమూడికి తరలి వచ్చారు. సూర్యప్రభ వాహన సేవకు నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి కృష్ణారెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు.

నేత్రపర్వంగా చంద్రప్రభ వాహనసేవ

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి చంద్రప్రభ వాహనసేవ నిర్వహించారు. పూలు, విద్యుద్దీపాలతో అలంకరించిన చంద్రప్రభ వాహనంపై వెంకయ్యస్వామిని ఆశీనులు గావించి గ్రామోత్సవం నిర్వహించారు. దీనిని తిలకించేందుకు భక్తులు పోటీపడ్డారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు ప్రదర్శించారు. చంద్రప్రభ వాహనసేవకు ఆల్తూరి గిరీష్‌రెడ్డి, లత దంపతులు, ఆల్తూరి మహేష్‌రెడ్డి, రాధిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవాలను ఆశ్రమ కార్యనిర్వాహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

ఉత్సవాల్లో నేడు

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం హనుమంతసేవ, రాత్రి హంసవాహన సేవలు నిర్వహించనున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



ఏర్పాట్లపై ఈఓ బాలసుబ్రహ్మణ్యంతో చర్చిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

వెంకటాచలం : భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. గొలగమూడిలో వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవ ఏర్పాట్లను ఆశ్రమ ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ఎస్పీ పరిశీలించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా 23, 24వ తేదీల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆ రెండు రోజుల్లో పోలీస్ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆశ్రమ ప్రాంగణంలో భక్తుల దర్శనం, భోజన సదుపాయం, కోనేరు, పార్కింగ్ పాయింట్లను పరిశీలించి, తగిన సూచనలిచ్చారు. పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన ప్రదేశంలో మాత్రమే వాహనాలు నిలిపేలా చర్యలు చేపట్టాలన్నారు. భక్తుల మనోభావాలు దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా విధుల నిర్వహణ చేపట్టాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఏఎస్పీ హిమవతి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

వెంకటాచలం: రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని యర్రగుంట వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. యర్రగుంట వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ వేగంగా దూసుకొచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల లార్వాను నివారించడం ద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టాలని చెప్పారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగేలా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. బడిఈడు పిల్లలు బడిలోనే ఉండేలా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. బడి మానేసి వివాహాలు చేసుకుని ఉన్నా ఓపెన్ స్కూలు ద్వారా చదువుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఎంపీపీ గాలి జ్యోతి మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 25 వరకు జరిగే ప్రత్యేక డ్రైవ్ ద్వారా చిన్నారులకు జనన ధ్రువీకరణలు మంజూరు చేయించడంతో పాటు వాటి ద్వారా ఆధార్‌లు మంజూరు చేయించే బాధ్యతను అంగన్‌వాడీలు తీసుకోవాలని సూచించారు. గౌతమ్ నగర్ సర్పంచ్ నాగిరెడ్డి సునీల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ మూడో లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. గండవరం ఉన్నత పాఠశాలలో రికార్డులు చెదలు పట్టిందని, కొత్త రికార్డులు ఏర్పాటు చేయాలని కోరారు. రేగడిచెలిక సర్పంచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామంలో సచివాలయ భవనం పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఈఓ జి.వసంతకుమారి, ఏఓ లక్ష్మి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు పి.సురేష్‌కుమార్, ఎ.రమేష్, ఏపీఎం రుక్మిణి, సర్పంచ్‌లు పెల్లేటి రజని, బి.రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

కోవూరు : గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి అన్నారు. మండలంలోని పడుగుపాడు– 1, 2 సచివాలయాలను ఎంపీడీఓ శ్రీహరితో కలిసి ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ పథకాల అమలు తీరుపై సిబ్బందితో సమీక్షించారు. అనంతరం జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ అర్హులెవరూ నష్టపోకూడదన్న ఆలోచనతో సచివాలయాల ద్వారా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. చిన్నచిన్న కారణాలతో అర్హులు సంక్షేమ పథకాలకు దూరం కాకూడదని, అటువంటి పొరపాట్లు ఉంటే మీ స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.